క్లుప్తంగా

పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో జూన్ 8న ఖమ్మంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి గిరిజన హక్కుల ఉద్యమ కార్యాచరణ సభను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు దశరథ్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సత్తుపల్లిలో మంగళవారం బహిరంగ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి కృపానాయక్, నందూనాయక్, కృష్ణానాయక్, రామకృష్ణ, రాము, వెంకటేశ్వరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

చేయూత అందించాలి



సాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చింతకాని: నిరుపేదలకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని శెట్టి మనోహర్ ఫౌండేషన్ సభ్యులు శెట్టి శ్రీకాంత్, సతీష్ అన్నారు. మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామంలో నిరుపేదలైన పాలిశెట్టి రాధ కుటుంబానికి శెట్టి మనోహర్ ఫౌండేషన్ సభ్యులు మంగళవారం రూ.30 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శెట్టి సురేష్, కన్నెబోయిన కుటుంబరావు, శెట్టి మోహన్‌రావు, పిస్నెల్లి శ్రీనివాస్, కొలిపాక వీరబాబు, సకినాల అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

వైరా: వైరా బస్టాండ్‌లో సెల్‌ఫోన్ మర్చిపోయిన ప్రయాణికుడికి కంట్రోలర్ వెంకన్న, ప్యాసింజర్ గైడ్ నాగేశ్వరరావు తిరిగి అప్పగించారు. కొణిజర్ల మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన మాలోతు నరసింహా ఖమ్మం వెళ్లేందుకు వైరా బస్టాండ్‌కు వచ్చి బస్సు ఎక్కే సమయంలో సెల్‌ఫోన్ మర్చిపోయాడు. గమనించిన సిబ్బంది ప్రయాణికుడికి తిరిగి ఫోన్ అప్పగించారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

చింతకాని: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని కోమట్లగూడెం గ్రామంలో మంగళవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. నాయకులు కూరపాటి కిషోర్, సట్టు వెంకటేశ్వర్లు, వనం చిన్నప్ప, అవులూరి వెంకట్రామిరెడ్డి, రమేష్, లక్కిరెడ్డి బాబురెడ్డి, శ్రీనివాసరావు, సత్యావతి, విజయ, కవిత, స్వరూపరాణి, రాజశేఖర్, పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి

బోనకల్: గ్రామస్థాయిలో పార్టీని అభివృద్ధి చేసేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఆత్మాకమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావు, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు అన్నారు. మండలంలోని నారాయణపురం నిర్వహించిన గ్రామశాఖ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామశాఖ అధ్యక్షుడిగా బత్తినేని తిరుపతయ్యను, కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు భద్రూనాయక్, చింతకాయల సతీష్, చేబ్రోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి చేరిక

చింతకాని: మండలపరిధిలోని కోమట్లగూడెంలో బీఆర్‌ఎస్ నుంచి పలు కుటుంబాలు మంగళవారం కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... నియోజకవర్గంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి చేరుతున్నారన్నారు. నాయకులు కూరపాటి కిషోర్, సట్టు వెంకటేశ్వర్లు, వనం చిన్నప్ప, అవులూరి వెంకట్రామిరెడ్డి, తడికమళ్ల రమేష్, లకిరెడ్డి బాబురెడ్డి, రాయల శ్రీనివాసరావు, తడికమళ్ల మహేష్, తదితరులు పాల్గొన్నారు

నివాళి

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంలో సీపీఎం నాయకులు దొడ్డా నారాయణ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపం వద్ద నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, మారెళ్ల దేవేందర్, వెంకటేశ్వరరావు, రాజారావు, రోశయ్య, నరసింహారావు, ప్రభాకర్, బుల్లి రాములు, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా ఆయకట్టు

సాగునీరు అందక అవస్థలు

- నిధులొచ్చి రెండేళ్లయినా నోచుకోని తూము మరమ్మతులు
- వృథాగా పోతున్న సాగు నీరు
- పట్టించుకోని అధికారులు



పంట కాల్వలో పెరిగిన పిచ్చి చెట్లు, తూటికాడ



బనిగండ్లపాడు గ్రామంలోని ఊర చెరువు

ఎర్రుపాలెం: మండలంలోని పెద్దగోపవరం–బనిగండ్లపాడు గ్రామాల రైతుల పొలాలకు నీరందక అవస్థలు పడుతున్నారు. స్థానిక ఊర చెరువు తూము షట్టర్లు ఐదేళ్ల క్రితమే మరమ్మతులకు గురవ్వటంతో చెరువు నీటిని రైతులు నిల్వ చేసుకోలేకపోతున్నారు. దీంతో సాగునీరు వృథాగా బయటకుపోతుండటంతో పొలాలకు నీరు రాక, వృథాగా పోతున్న నీటిని చూసి ఆయకట్టు రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కట్లేరు నుంచి నల్లచెరువుకు అక్కడ నుంచి ఊర చెరువుకు సాగునీరు చేరాల్సి ఉండగా నల్లచెరువు నుండి సాగునీరు రావడానికి నిర్మించిన పంట కాల్వ అంతటా తూటికాడ, పిచ్చిమొక్కలు దట్టంగా మొలిచాయి. ఒక వైపు చెరువు తూము షట్టర్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో, మరో వైపు కట్లేరు నీరు పంట కాల్వను మరమ్మతు చేయకపోవడంతో చెరువులోకి నీరు రాక ఆయకట్టు ప్రశ్నార్థకంగా మారింది.

నిధులున్నా అధికారుల నిర్లక్ష్యం..

పూర్తిగా వర్షాధార చెరువుగా మారిన ఊరచెరువుకు ఆయకట్టు దాదాపు వంద ఎకరాలకు పైగా ఉంది. కట్లేరు కాల్వ ద్వారా కూడా చెరువులోకి సాగు నీరు వస్తుంది. దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన తూము షటర్లు శిథిలమయ్యాయి. చెరువులోకి చేరిన వర్షం నీరు తూము షట్టర్లు మరమ్మతులకు గురికావడంతో నీరు బయటకు వృథాగాపోతుంది. ప్రతీ ఏటా తూముల నుంచి బయటకు పోకుండా ఇసుక బస్తాలు అడ్డుగా వేసి కాపాడుకుంటూ రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై మొరపెట్టుకుంటే మరమ్మతులకు 2022 సెప్టెంబర్‌లో అప్పటి ప్రభుత్వం రూ.4.5 లక్షలు నిధులు మంజూరు



మరమ్మతుకు గురైన చెరువు తూము షట్టర్లు

చేసింది. అప్పటి నుంచి పనుల నిర్వహణలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. పంటలు సాగు కాలం సమీపిస్తున్న క్రమం, రుతుపవనాల వర్షంతో చెరువు నిండే వీలుండటంతో సకాలంలో ఇరిగేషన్ అధికారులు స్పందించి తూములు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుని తమను ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

నిధులొచ్చినా చేయడం లేదు



చెరువు అలుగు వద్ద షట్టర్లు, తూముల కోసం రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తూము షట్టర్లు మరమ్మతులు చేయకపోవడంతో చెరువులో నీరు వృథాగా పోతుంది. నిల్వ చేసుకోలేక అవస్థలు పడుతున్నాం. సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వేడుకున్నప్పటికీ వారిలో ఏమాత్రం చలనం లేదు. ఇంకెన్నేళ్ళు అధికారులు ఇబ్బంది పెడతారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోండి.

– తల్లపురెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రైతు, బనిగండ్లపాడు

అధికారులు నిర్లక్ష్యం వీడాలి..



తూము షట్టర్లకు మరమ్మతులు చేయకపోవడంతో వృథాగా నీరు పోతుంది. ఇసుక బస్తాలు వేసుకుని నీటిని నిల్వ చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతీ ఏటా సాగు కోసం ఇబ్బంది పడుతూనే ఉన్నాం. మరమ్మతులు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు చేయకుండా అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలి.

– వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతు, బనిగండ్లపాడు

మరమ్మతు చేయిస్తాం..



చెరువు తూము మరమ్మతులకు నిధులు మంజూరైన విషయం నిజమే. మరమ్మతులు కొంతమేరకు జాప్యం జరిగింది. ఇబ్బంది పడుతున్న రైతులు కూడా సమస్యను మా దృష్టికి తెచ్చారు. వేసవికాలం పూర్తయ్యేలోపే తూము మరమ్మతులు చేపిస్తాం. నల్లచెరువుటూ ఊరచెరువు పంట కాల్వలో పిచ్చి చెట్లు, తూటికాడ తొలగింపు మాకు సంబంధం లేదు. ఆ పనులు ఉపాధి హామీ పనుల ద్వారా చేయించుకోవాలి.

– టి.సాంబశివరావు, ఇరిగేషన్ డీఈ, ఎర్రుపాలెం

బడి బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంవీఐ శ్రీనివాసరావు

సత్తుపల్లిటౌన్: బడిబస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలని, ఫిట్‌నెస్ లేకుండా స్కూల్ బస్సులు నడిపితే సీజ్ చేస్తామని సత్తుపల్లి ఎంవీఐ జేఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో విద్యాసంస్థల యాజమాన్యాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బడిబస్సుల ఫిట్‌నెస్‌కు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. విద్యాసంస్థల పునఃప్రారంభానికి ముందే బస్సుల సామర్థ్య పరీక్షలు పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల యాజమాన్యాలు కిరణ్‌కుమార్, నాయుడు వెంకటేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, మారేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

చింతకాని: మండల పరిధిలోని నేరడ గ్రామంలో లబ్ధిదారుడికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంగళవారం సీపీఐ మండల సహాయ కార్యదర్శి దూసరి గోపాలరావు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మంకెన నాగేశ్వరరావు, పెరిక నాగేష్, మంకెన శ్రీను, గుండెపోగు ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఆశా వర్కర్లు

ఎర్రుపాలెం: ఆశా వర్కర్లకు ప్రభుత్వం కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, సీపీఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బనిగండ్లపాడు పీహెచ్‌సీ ఎదుట ఆశా వర్కర్లతో సీఐటీయూ నాయకులు కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి సగ్గుర్తి సంజీవరావు, సంద్రు సుధారాణి పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకపోతే మనుగడ కష్టమే



మాట్లాడుతున్న ఎర్ర బాబు

కారేపల్లి: ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో మనుగడ కష్టమేనని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎర్ర బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఉసిరికాయలపల్లి, భాగ్యనగర్‌తండా గ్రామాల్లో సీపీఐ గ్రామశాఖ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరికాయలపల్లి గ్రామశాఖ మహాసభలో గ్రామ కార్యదర్శిగా ఇస్లావత్ అమృ, సహాయ కార్యదర్శిగా రెడ్డెబోయిన రవిలను, భాగ్యనగర్‌తండా గ్రామశాఖ కార్యదర్శిగా ఇస్లావత్ భావ్‌సింగ్, సహాయ కార్యదర్శి బాలును ఎన్నుకున్నారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏపూరి లతాదేవి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రావి శివరామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్, పుచ్చకాయల శ్రీనివాసరావు, మాంగు, సయ్యద్ అమీర్, కోటమ్మ, లకావత్ కృష్ణ, బాలాజీ, లకావత్ హరిదాస్, బోడ భద్రు, కొలియా, రావోజీ, బాలాజీ పాల్గొన్నారు.

లేబర్‌కోడ్లను తక్షణమే రద్దు చేయాలి



మధిర: బస్‌డిపోలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్‌కోడ్లను రద్దుచేసి కార్మిక చట్టాలను అమలు చేయాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన ర్యాలీలు, రాస్తారోకోలు నిర్వహించారు. పలుచోట్ల కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



తల్లాడలో..



ఏన్కూరులో..

విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి



విత్తన ప్యాకెట్లు పరిశీలిస్తున్న ఏఓ బాలాజీ

కొణిజర్ల: లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే రైతులు పత్తి విత్తనాలు కొనాలని మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని మన కోరమండల్ దుకాణంలో పత్తి విత్తనాలను మంగళవారం పరిశీలించారు. విత్తనాలు మొలక శాతం చూసి పరీక్షించుకున్న తర్వాతే విత్తుకోవాలన్నారు. బిల్లు లేకుండా విత్తనాలు ఎట్టి పరిస్థితులలో కూడా తీసుకోవద్దన్నారు.

ఎర్రుపాలెం: విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఓ బి.సాయిశివ ఒక ప్రకటనలో కోరారు. లైసెన్సు డీలర్ దుకాణాలకు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రశీదులు విధిగా తీసుకోవాలని, నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని తెలిపారు.

రక్తదానం

కొణిజర్ల: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని తలసేమియా చిన్నారుల కోసం ఖమ్మంలోని ప్రముఖ పిల్లల వైద్యుడు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయశ్రీ బ్లడ్ బ్యాంక్‌లో కొణిజర్ల మండలం పల్లిపాడుకు చెందిన తాటిపల్లి రణధీర్ చౌదరి, ముక్కా భానుప్రకాష్ చౌదరి తదితరులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారికి డాక్టర్ ప్రదీప్, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు తాటిపల్లి సుధీర్ లు సర్టిఫికేట్లు ప్రదానం చేశారు.

ఓబీ కమిటీని రద్దుచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముదిగొండ: నిబంధనలకు విరుద్ధంగా ఎన్నుకున్న ఓబీ కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీసీ చర్యలకు వ్యతిరేకంగా వెలుగు ఆఫీస్ ఎదుట మండల పరిధిలోని కమలాపురం గ్రూపు సభ్యులు మంగళవారం ఆందోళన చేపట్టారు. అనంతరం వెలుగు ఏపీఎం కల్పన, ఎంపీడీఓలకు వినతిపత్రాలు అందజేశారు. గ్రూపు సభ్యులకు సీపీఎం, బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, కుక్కల రామచంద్రం, బంకా మల్లయ్య, మరకింటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

- ఎమ్మెల్యే రాగమయి



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతీ ప్రభుత్వమని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలోనే రైతులకు అద్భుతమైన పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని కాకర్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో మంగళవారం రైతులకు జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏఓ శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు తుమ్మూరు శ్రీరాంప్రసాద్, సీఈఓ వెంకటేశ్వరరావు, నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, మాజీ ఎంపీపీ చల్లూరి వెంకటేశ్వరరావు, కిలారి వెంకటేశ్వరరావు, కంచర్ల రమేష్, పువ్వాళ్ల ఉమా, బేతిని బాబు, దొడ్డా సత్యం, పాదిలి మారేశ్వరరావు, తమ్మిశెట్టి గణేష్, పాదిలి శ్రీను, కూరపాటి నాని, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరాలో ఈనెల 24న వైరాలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళా విజయవంతమయ్యేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ సూచించారు. వైరాలోని క్యాంపు కార్యాలయంలో ఎంపీడీఓలు, జీపీల కార్యదర్శులు, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సారథ్యాన సింగరేణి సహకారంతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఎక్కువ మంది హాజరయ్యేలా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలో జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించి.. అక్కడ క్రికెట్ ఆడుతున్న పిల్లలతో కలిసి సరదాగా బ్యాటింగ్ చేశారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ చింతా వేణు, ఏసీపీ ఎం.ఏ.రహమాన్, సీఐ సాగర్ నాయక్, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

కాగా, వైరాలోని వైరాలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు ఏర్పాటుచేసిన శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పరిశీలించి మాట్లాడారు. ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లుతో పాటు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, శీలం వెంకటనర్సిరెడ్డి, పమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాపై అవగాహన కల్పించాలి

వైరారూరల్: ఈ నెల 24న వైరా ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే మెగా జాబ్‌మేళాపై గ్రామ స్థాయిలో నిరుద్యోగులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ పి.సరస్వతి సూచించారు. వైరాలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 80 ప్రైవేట్ సంస్థలతో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో 10, ఇంటర్, డిప్లమా, డిగ్రీతో పాటు ఉన్నత విద్యావంతులు, నిరుద్యోగులు పాల్గొనే అవకాశం కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ జ్యోత్స్నదేవి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సాగులో యూరియా వాడకాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ భరత్

మధిర: సాగులో యూరియా వాడకాన్ని తగ్గించుకుంటే సాగు ఖర్చు తగ్గడమే కాకుండా భూసారం కాపాడుకోవచ్చని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ టి.భరత్ అన్నారు. ఈ మేరకు మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మల్లవరం గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పచ్చిరొట్ట పంటలను వేసుకోవడం, పంట అవశేషాలను భూమిలో కలియదున్నడంతో సేంద్రీయ కర్బనం శాతాన్ని పెంచవచ్చన్నారు. వానాకాలంలో వరి సాగు చేసి, యాసంగిలో అపరాలు, నూనె గింజల పంటలు సాగు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓ కె.సాయి దీక్షిత్, వ్యవసాయ విస్తరణ అధికారి రఘు, రైతులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కల్లూరురూరల్: మండలంలోని పలు గామాల్లో మంగళవారం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడం..

చింతకాని: కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు భయపడేది లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో అధికార పార్టీకి వ్యతిరేకంగా పోస్టులు పెడితే బీఆర్‌ఎస్ కార్యకర్తలను చంపుతామని కాంగ్రెస్ నాయకులు బెదిరిస్తున్నారని, అధికారం ఎవరికి శాశ్వతం కాదని, భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు వెంకట్రామయ్య, నాయకులు గురిజాల హనుమంతురావు, మంకెన రమేష్, నన్నక కోటయ్య, ఏడుకొండలు, ఉన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



సత్తుపల్లి: మాట్లాడుతున్న ఎంఈఓ రాజేశ్వరరావు



మధిర: శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

సత్తుపల్లి: శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని, నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని సత్తుపల్లి ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు. ఈ మేరకు మంగళవారం ఉపాధ్యాయుల ఐదురోజుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. రిసోర్స్ పర్సన్లు మధుసూదనాచారి, చెన్నకేశవరెడ్డి, బాలాజీ, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రవికుమార్, లక్ష్మణ్‌రావు, వెంకటేష్, హెచ్‌ఎంలు ఉన్నారు.

మధిర: విద్యారంగ బలోపేతమే లక్ష్యంగా ఐదు రోజులపాటు జరగనున్న ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని మధిర సీపీఎస్ పాఠశాలలో ఎంఈఓ వై.ప్రభాకర్ ప్రారంభించారు. రిసోర్స్ పర్సన్స్ ఎండి.జమీర్, విశ్వనాథం, నరసింహారావు, హసీనా, మహేంద్ర కుమార్ పాల్గొన్నారు.

బోనకల్: బోధనలో నైపుణ్యాన్ని పెంచుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ దామాల పుల్లయ్య అన్నారు. మండలంలోని రావినూతల పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణను ప్రారంభించారు.

ఎరుపాలెం: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులకు ఇన్‌సర్వీస్ శిక్షణ తరగతులను ఎంఈఓ మురళీమోహన్‌రావు ప్రారంభించారు. రిసోర్స్ వెంకటేశ్వరరావు, మదన్‌మోహన్‌రెడ్డి, నాగరాజు, భరత్, ఖాజా మొహిద్దీన్, సుధాకర్, నరసింహారావు, త్రివేణి, తదితరులు ఉన్నారు.

చింతకాని: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ సలాది రామారావు అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని కొదుమూరు ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.



బోనకల్: రావినూతలలో..



ఎర్రుపాలెంలో..



చింతకానిలో..